క్లుప్తంగా

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఇన్‌స్ట్రక్టర్లు

దౌల్తాబాద్: పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని మండలంలోని అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు శనివారం ఎంఈఓ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రెండు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, అక్రంపాష, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన బోధన చేయండి

తహసీల్దార్ మురళీధర్



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న తహసీల్దార్ మురళీధర్

కుల్కచర్ల: విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని కుల్కచర్ల తహసీల్దార్ మురళీధర్ పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండల కేంద్రంలోని కస్తుర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రభుత్వం కేజీబీవీలలో నాణ్యమైన విద్య అందిస్తుందని విద్యార్థుల భవిష్యత్‌కోసం ఉపాధ్యాయులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు తేలికగా అర్థమయ్యేవిధంగా బోధన చేపట్టాలన్నారు. అవసరమైతే బోధనోపకరణాలను ఉపయోగించి పాఠాలు బోధించాలన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయ బృందం, ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, చౌడాపూర్ కేజీబీవీ ప్రత్యేకాధికారి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో పేదలకు లబ్ధి

సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

దోమ: వైద్య శిబిరాలతో పేదలకు లబ్ధి చేకూరుతుందని సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి పేర్కొన్నారు. శనివారం దోమ మండల కేంద్రంలో సాధన మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు ఆర్థికభారం తగ్గడమే కాకుండా మెరుగైన వైద్యసేవలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ ఇంచార్జి వెంకటయ్య, డాక్టర్ అన్వర్, సిబ్బంది రామస్వామి, మాలి శివకుమార్‌రెడ్డి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెటర్ భవిష్యరెడ్డికి సన్మానం



భవిష్యరెడ్డిని సన్మానిస్తున్న బ్యాడ్మింటన్ క్రీడాకారులు

తాండూరు: హైదరాబాద్ క్రికెట్ అసోషియేషన్‌లో అర్హత సాధించిన భవిష్యరెడ్డిని శనివారం బ్యాడ్మింటన్ క్రీడాకారులు సన్మానించారు. మల్‌రెడ్డిపల్లి ప్రాంతానికి చెందిన భవిష్యరెడ్డికి హెచ్‌సీఏలో అర్హత సాధించడంతో తాండూరు బ్యాడ్మింటన్ క్రీడాకారులు యు.రమేష్‌కుమార్, కేశవులు, ప్రతాప్, రాంప్రసాద్, శ్రీవర్ధన్, పవన్, ఓంకార్, విశాల్ సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

పరామర్శ

దౌల్తాబాద్: బాలంపేట గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాసచారి అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. గోకఫసల్‌వాద్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కేశవరెడ్డి తండ్రి నారాయణరెడ్డి ఇటీవల మృతి చెందారు. వీరి కుటుంబాలను శనివారం నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంబడి మండల అధ్యక్షుడు వెంకట్రావు, ప్రమోద్‌రావు తదితరులు ఉన్నారు.

సస్యరక్షణతో మంచి దిగుబడి

- వేరుశనగ సాగుకు సమయమిదే
- నవంబర్ చివరి వరకు పంట విత్తుకోవచ్చు
- మెలకువలు పాటిస్తే మంచి ఫలితాలు : ఏఈఓ ఆదిల్



నవాబుపేట: వేరుశనగ సాగును నవంబర్ చివరి వరకు విత్తుకోవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వేరుశనగ నూనె గింజల పంటలో ముఖ్యమైంది కాబట్టి పంట సాగులో రైతులు కొన్ని మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. ప్రధానంగా వేరు శనగాలో చీడపీడలు సస్యరక్షణ చర్యలు పాటించాలని మండల ఏఈఓ ఆదిల్ రైతులకు సూచిస్తున్నారు.

తెగుళ్ల ఉధృతి

ఈ పంటకు అధిక దిగుబడులు ఇచ్చే కదిరి–6 హరితాంధ్ర, ధరణి, జేఎల్2జీ, కదిరి–99, జేసీజీ–88 రకాలు అనుకూలం. వేసవిలో లోతుగా దుక్కులు చేయడం వలన పంటను నష్టపరిచే కీటకాలు, తెగుళ్ల ఉధృతిని తగ్గించవచ్చు. రబీలో విత్తనాన్ని నీటి పారుదల కింద విత్తుకోవాలి. విత్తే ముందు విత్తన శుద్ధిపై అవగాహన లేకపోవడంతో మొలక శాతం తగ్గిపోవడమే గాక, చీడపీడల బారిన పడి పంటకు నష్టం వస్తుంది. ముఖ్యంగా తిక్క ఆకు పచ్చ తెగుళ్ల, కాండం కుళ్ల తెగులు, మొదలు కుళ్ల, తెగుళ్ల నివారణకు టెబుకొనజోల్ 1 గ్రాము లేక 3గ్రాములు మ్యాంకోజెబ్ పొడి మందును ఒక కిలో విత్తనానికి సరిపడ పట్టించి విత్తుకుంటే ఈ తెగుళ్ల రాకుండా నివారించుకోవచ్చు. అలాగే కాండం కుళ్ల వైరస్ మొవ్వకుళ్ల వైరస్ తెగుళ్లకు వ్యాప్తి చెందించే తామర పురుగుల నివారణకు ఇమడాక్లోప్రిడ్, 2 మిల్లీ మీటర్లు, కిలో విత్తనానికి పట్టించి విత్తుకోవాలి. కొత్తగా వేరుశనగ సాగు చేసే నేలల్లో



వేరుశనగ సాగు

60 కిలోల విత్తనానికి 1కిలో రైజోబియం కల్చరూత కలిపి విత్తుకోవాలి.

చీడపీడలలో ముఖ్యమైనవి

ఎర్ర కొంగలి పురుగు, వేరుశనగ పురుగు, ఆకు ముడత, పొగాకు, లద్దెపురుగు, రసం పీల్చే పురుగులైన తామర పురుగులు, పేనుబంక, పచ్చదోమ ముఖ్యమైనవి.

వేరు పురుగు

విత్తేముందు దుక్కిలో ఫోరేట్ 10 శాతం గుళికలు ఎకరాకు 6కిలోలు వేయాలి. అలాగే ఒక కిలో విత్తనానికి 2 మిల్లీ మిటర్‌లో ఇమిడాక్లోప్రిడ్ లేదా క్లోరిపైరిపాస్ 6.5 మిల్లీ మీటర్లు కలిపి విత్తుకోవాలి.

ఆకు ముడత

విత్తన 15 రోజుల నుంచి ఆశిస్తుంది. ఈ పురుగులు రెండు, మూడు ఆకులను కలిపి గూడు చేసుకొని వాటిలో ఉండి పచ్చదనాన్ని గోకి తినడం వలన ఆకులన్ని ఎండిపోతాయి.

ఎర్రగొంగలి పురుగు

తల్లి పురుగులు 500–1000 గుడ్లను సమూలుగా పెడతాయి. ఆహారం కొరకు వేరే పొలానికి దుండ్లుగా వలస పోవడం సాధారణం.

నివారణ

వర్షం పడిన రెండో రోజు నుంచి రాత్రి పూట 8–11 గంటల సమయంలో రాత్రి మంట వేస్తే ఎక్కువగా ఆకర్శించబడి మంటలో పడి చనిపోతాయి. పొలం చుట్టూ మడక సాలు వేసుకోవాలి. మిథైల్ పారాథియాన్ 2 శాతం, పొడిమందు 1కిలో చల్లుకోవాలి. పొలం చుట్టు అలసంద, ఆముదం పంటలను ఎర పంటలుగా వేయాలి. విషపు ఎరలు, వరితవుడు పది కిలోలు ప్లస్ బెల్లం ఒక కిలో ప్లస్ క్వినాల్‌పాస్ 1 లీటర్‌లో తగినంత నీరు కలిపి చిన్నచిన్న ఉండలుగా చేసి పొలంలో చల్లినట్లయితే వాటిని నివారించవచ్చు.

పొగాకు లెద్ద పురుగు

వీటి నివారణకు నాలుగు లింగాకర్షక బుట్టలు ఎకరాకు అమర్చి వాటి ఉనికిని గమనించవచ్చు. ఎరపంటగా ఎకరాకు 30–40 ఆముదం, పొద్దుతిరుగుడు మొక్కలు వేయాలి. అలాగే ఎకరాకు పది పక్షిస్థావరాలు పెట్టాలి. ఎక్కువ నష్టం కన్పించినట్లయితే నొవల్యురాన్ 1మిల్లీ లీటర్ లేదా ఆథయోడికార్బ్ 1.5 గ్రాము లేదా క్వినాల్‌పాస్ 2మిల్లీ లీటర్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి.

తామర పురుగులు

మొవ్వకుళ్ల వైరస్ తెగుళ్లను సంక్రమింపజేస్తాయి. ఎక్కువ ఆశించినట్లయితే ఆకులు ముడుచుకొని పోతాయి.

మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీ లీటర్ల ప్లస్ వేపనూనె మిల్లీ లీటర్ ప్లస్ పొడి 5 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలుపుకొని పిచికారి చేయాలి. ముఖ్యంగా 25 రోజుల మధ్య రెండు సార్లు పైన తెలిపిన మందును వేసి పిచికారి చేయాలి.

పేను బంక

ఈ పేనుబంక లేద ఆకులు, కొమ్మల చివర్ల, పూత దశలో రసాన్ని పీల్చడం, తేనేవంటి జిగురు స్రవిస్తాయి. దీని మూలానా నల్లని బూజు ఏర్పడుతుంది. డైమిథోయెట్ 2 మిల్లీ లీటర్ లేదా మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీ లీటర్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి.

పచ్చ దోమ

ఇవి ఆకు అడుగు భాగాన చేరి పిల్ల, పెద్ద పురుగులు రసాన్ని పీల్చడం వల్ల వీ ఆకారంలో ఆకు చివర్లో పసుపు వర్ణానికి మారి, ఆకులు వడలి పోతాయి. మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీ లీటర్ లేదా డైమిథోయెట్ 2 మిల్లీ లీటర్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి.

అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా వెంకటయ్య గౌడ్



వెంకటయ్యను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

కుల్కచర్ల: ఘనపురం గ్రామానికి చెందిన బీజేపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్యను కేంద్ర టెలికాం అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా నియమిస్తూ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కరణం ప్రహ్లాదరావు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాతీయవాద భావాలతో ఒకే పార్టీలో ఉంటూ ఎలాంటి అవకాశవాద రాజకీయాలకు తావివ్వకుండా నిబద్ధతతో పనిచేసిన బీజేపీ కార్యకర్త వెంకటయ్య గౌడ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు కాటనిపల్లి అంజిలయ్య, గాదె మైపాల్, గిరిజన మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జానకిరాం చౌహాన్, మాజీ వైఎస్ ఎంపీపీ సంగెం లక్ష్మయ్య, సంతోష్, సాయన్న, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



తాండూరు: శాంతుకుమార్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

గాజుల శాంతుకుమార్‌కు సన్మానం

తాండూరు: బీఎస్ఎన్ఎల్ సభ్యుడిగా తాండూరు అసెంబ్లీ నుంచి గాజుల శాంతుకుమార్‌కు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించడం హర్షణీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు రమేష్‌కుమార్ అన్నారు. శనివారం తాండూరు పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు గాజుల శాంతుకుమార్‌ను కేంద్ర ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్ సభ్యుడిగా నియమించింది. ఈ సందర్భంగా యు.రమేష్‌కుమార్‌తో పాటు రాష్ట్ర మహిళామోర్చా కార్యదర్శి సాహు శ్రీలత, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణముదిరాజ్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అంతారం లలితలు గాజుల శాంతుకుమార్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

మతిభ్రమించి మాట్లాడుతున్నారు

పీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి

ధారూరు: వచ్చే సంవత్సరం జూన్ వరకు సీఎం రేవంత్‌రెడ్డిని కుర్చీ నుంచి దింపేస్తారని బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మతి భ్రమించి మాట్లాడుతున్నారని పీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావల్సిన నిధుల విషయంలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలకు ప్రధానితో మాట్లాడే చేతకాక సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎంలను దింపే పని తప్పా బీజేపీ మంత్రులకు, నాయకులకు వేరే ధ్యాస ఉండదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్‌తో తెలంగాణ ప్రజలకు మంచి అనుబంధం ఉందని, మరో 10 సంవత్సరాలు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

సదర్ పండుగను గుర్తించడం హర్షణీయం

దోమ: యాదవులు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకునే సదర్‌ను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడం హర్షణీయమని బొంపల్లి యాదవుల సంఘం గ్రామ ఉపాధ్యక్షుడు ముద్దం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దీపావళి తర్వాత యాదవ కమ్యూనిటీ సభ్యులు ఎంతో వైభవంగా చేసుకునే అతిపెద్ద పండుగా సదర్ ఉత్సవాలని, అలాంటి వాటికి 70 ఏళ్లకు పైగా చరిత్ర ఉందని గుర్తు చేశారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు

యాలాల: దౌలాపూర్ శివారులో వెలసిన రక్తమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కు సంబంధించి ఏర్పాట్లను భక్తమండలి సభ్యులు చురుగ్గా చేపడుతున్నారు. శనివారం ఆలయ సమీపంలో, చుట్టుపక్కల జేసీబీ సహాయంతో శుభ్రపరిచారు. అనంతరం ఆలయం ఎదురుగా మొరం పోసి రోలర్‌తో చదును చేయిస్తున్నారు. ఈ నెలా 13 నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గాసాగుతున్నాయి. దాత లు ఎవరైనా సాయం చేయాలనుకుంటే 8897075404, 8688257557 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆలయ కమిటీ నిర్వాహకులు కోరారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

కొడంగల్ రూరల్: గురుకుల విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ గ్రామశివారులోని గిరిజన గురుకుల విద్యాలయంలో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వార్డెన్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పోలింగ్‌పై విద్యార్థులకు అవగాహన



ఓటరు స్లిప్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ హబీబ్ అహ్మద్

కుల్కచర్ల: విద్యార్థులు పోలింగ్‌పై అవగాహన కలిగి ఉండాలని కుల్కచర్ల మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్ పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రతిఒక్కరూ ఎన్నికల విధానం, పాటించాల్సిన నిబంధనలు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల మాజీ సర్పంచ్ పట్లోళ్ల సౌమ్యారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి



చీలాపూర్‌లో పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

పూడూరు: పత్తి కోసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి తులసిరాం రైతులకు సూచించారు. శనివారం చీలాపూర్‌లో పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పత్తి విత్తనాలు నాటే సమయంలో తీసుకున్న జాగ్రత్తలు పత్తిని తీసి మిల్లుకు పంపే వరకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంచు అధికంగా కురుస్తున్న సందర్భంగా పత్తిని తీయొద్దని, మంచు తగ్గిన తర్వాత పత్తిని తీస్తే మసి తెగుళ్లు రాకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు రామక్రిష్టారెడ్డి, పెంటయ్య, ఏఈఓ సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

శబరికి అయ్యప్ప స్వాముల పాదయాత్ర

దౌల్తాబాద్: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన అయ్యప్ప స్వాములు శబరిమల అయ్యప్ప స్వామి దర్శనం నిమిత్తం పాదయాత్రతో బయలుదేరారు. గ్రామానికి చెందిన గుడిపిల్ల ఆశప్ప, జోగుఅంజప్పలు శనివారం మాల ధరించి పాదయాత్ర ప్రారంభించారు. జనవరి 8న శబరిమల చేరుకుంటామని తెలిపారు.

పేద కుటుంబాలకు అండగా ఉంటాం

దోమ: పేద కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ ఎంపీటీసీ వెంకట్ అన్నారు. శనివారం బొంపల్లి తండాలో వర్త్యా కిషన్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేలు సాయం చేశారు. హరి, శంకర్, చత్ర్యా, పాల్గొన్నారు.

తాండూరు అభివృద్ధికి కృషి



పనులు ప్రారంభిస్తున్న బాల్‌రెడ్డి తదితరులు

మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి

తాండూరు రూరల్: ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సహకారంతో తాండూరును అభివృద్ధి చేయనున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గౌతపూర్–చించోళి రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడారు. తాండూరు అభివృద్ధికి నిత్యం పరితపిస్తున్న వ్యక్తి ఎమ్మెల్యేనని కొనియాడారు. ఆయన ఆధ్వర్యంలో తాండూరు రూపురేఖలు మారనుందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్ ఆరోపణలు అవాస్తవమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జర్నప్ప, భాస్కర్‌రెడ్డి, రాజు, మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్, జగదీష్, రాంచంద్రారెడ్డి, మల్లారెడ్డి, కె.శ్రీనివాస్, ప్రవీణ్, హరికృష్ణ, అఛ్యుత్, బాలవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీడీఓ కరీ

పరిగి: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీడీఓ కరీ పేర్కొన్నారు. శనివారం రాఘవపూర్ గ్రామంలో ఇంటింకి తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామంలో ఇంటింటికి నీరు సక్రమంగా సరఫరా అవుతుందా? లేదా? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామంలోని ప్రతి వార్డును పరిశీలించి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మౌనిక, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, రాములు, నగేష్, సుదర్శన్‌రెడ్డి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

దోమ: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతుకుమార్ పేర్కొన్నారు. శనివారం ఖమ్మంనాచారం గ్రామంలో బోయిని కిష్టప్పకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నివాసంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా శాంతుకుమార్ మాట్లాడారు. ప్రభుత్వం పేదల పక్షాన పనిచేస్తుందని, అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాదయ్య, బాసపల్లి మాజీ సర్పంచ్ అనంతయ్య, ఉపసర్పంచ్ బొయిని రమేశ్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్ల: బండవెల్కిచర్ల గ్రామపంచాయతీకి చెందిన ఉప్పులాంచి కంకంటి, నయమద్ బాబలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం కాంగ్రెస్ నాయకులు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిరుపేద బడుగుబలహీన వర్గాల ఉన్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లి నారాయణ, మహిపాల్ రెడ్డి, గోవర్దన్ రెడ్డి, ఎల్లప్ప, చెన్నప్ప, శ్రీనివాస్ రెడ్డి, అంజయ్య, రాములు, మహేందర్, రవికుమార్, ఇమ్రాన్, బిచ్చయ్య, నర్సింహా రెడ్డి, నూరుద్దిన్, కావలి రాములు, చంద్రయ్య, అశ్వం, మాసగళ్ల రాములు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబీకులకు చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రతి ఉద్యోగికి బదిలీ సహజం

విద్యాధికారి అబ్దుల్ రెహమాన్

నవాబుపేట: ప్రతి ఉద్యోగికి బదిలీ సహజమని విద్యాధికారి అబ్దుల్ రెహమాన్ పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఎక్కడ పని చేశామనేది కాకుండా విద్యా బోధనతో విద్యార్థులకు ఎంత మేలు చేశామనేదే చూడాలని ఆయన పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో శనివారం మండల విద్యాధికారిగా బదిలీపై వెళ్తున్న గోపాల్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పని చేసే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు.



గోపాల్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

కలిసి పోరాటం చేద్దాం

ఫార్మా వ్యతిరేక పోరాట సమితి

దుద్యాల్: రైతులు ఎవరు కూడా అధైర్య పడొద్దని, అందరం కలిసి పోరాటం చేద్దామని ఫార్మా వ్యతిరేక పోరాట సమితి నాయకులు భూ బాధిత రైతులకు భరోస కల్పించారు. శనివారం మండల పరిధిలోని హకీంపేట గ్రామంలో ఫార్మా బాధితుడు కిష్టప్ప ఇంటి దగ్గర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మా వ్యతిరేక పోరాట సమితి నాయకులు మాట్లాడారు. ఫార్మా కంపనీ ఏర్పాటుకు భూములు కోల్పోయే రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం పెంచే ప్రయత్నం చేస్తుందని, దీనికి కొంత మంది రైతులు అనుకూలంగా ఉన్నారన్నారు. తాము ఫార్మా కంపనీ ఏర్పాటు వద్దని పోరాటాలు చేస్తుంటే పరిహారం పెంచుతామని రైతులకు ఆశ చూపి భూములు గుంజుకోవడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఫార్మా బాధితులు బసప్ప, నారాయణ, శివకుమార్, రాజు నాయక్, రామ్ నాయక్, గోపాల్ నాయక్, కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫార్మా భూ బాధితులు

ఉపాధ్యాయుల సమస్యలపై అలసత్వం వద్దు

బొంరాస్‌పేట: రాష్ట్ర వ్యాప్తంగా అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం అలసత్వం చూపొద్దని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు గౌరారం గోపాల్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని బురాన్‌పూర్, మదన్‌పల్లి, దీప్లా నాయక్‌తండ, కాకర్లగండ తండా, మహంతీపూర్ తదితర పాఠశాలల్లో నూతన ఉపాధ్యాయులను సంప్రదించి తమ సంఘంలో సభ్యత్వం చేయించారు. మల్లేశ్, అలీమొద్దిన్, రమేశ్, గుంజవెంకటయ్య, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేయిస్తున్న గోపాల్

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయండి

పరిగి: విద్యుత్ సమస్యలు ఏమైన ఉంటే పరిగి సబ్ డివిజన్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని ఏడీఓ కేవీ నాయకుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా సబ్ డివిజన్ కార్యాలయంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఇంటింటి సర్వే ప్రారంభం

దౌల్తాబాద్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇంటింటి సర్వేలో భాగంగా శనివారం అధికారులకు కేటాయించిన ఇంటి నంబర్లను పరిశీలించి సంబంధిత పోస్టర్లను అతికించారు. ఈ నెల 6 నుంచి సర్వే ప్రారంభమవుతుందని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. దీనికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.